# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 148 వ భాగం

## సూర్య వంశం – 16, రామ కథ - 6

- b

ఉత్తర రామాయణం చివరిలోకి వచ్చాం. సీతని అడవిలోకి పంపాక రాముడు మనసులో ఎంత క్షోభ అనుభవించాడనేది పైకి కనిపించదు. అయితే యాగం చేస్తున్నప్పుడు అక్కడకి వచ్చి రామకథా శ్లోకాలు పాడుతుంటే ముచ్చటపడి లవ కుశలని చూసాక మీరెవరు అని అడిగాడు రాముడు. దానికి వాళ్ళు సమాధానం చెప్తున్నారు.

వ. అనిన వార "లేము వాల్మీకి పౌత్రులము; రాఘవేశ్వరుని యాగంబు చూడ వచ్చితి" మనవుడు; మెల్లన నగి "యెల్లి ప్రొద్దున మీ తండ్రి నెఱింగెద; రుండుం" డని యొక్క నివాసంబునకు సత్కరించి పనిచె; మఱునాఁడు సీతం దోడ్కొని కుశలవుల ముందట నిడుకొని వాల్మీకి వచ్చి రఘుపుంగవునిం గని యనేక ప్రకారంబుల వినుతించి; యిట్లనియె. [9-354]

మేము వాల్మీకి మనవలం (పౌత్రులు), రాముడు యజ్ఞం చూడ్డానికి వచ్చాం. ఇది వినేసరికి రాముడికి తెల్సింది వాళ్ళెవరో. తానే కదా సీతని వాల్మీకి ఆశ్రమంలో విడిచి రమ్మని లక్షణుణ్ణి తోడిచ్చి పంపాడు? అక్కడికక్కడే నేనే మీ తండ్రిని అంటే ఏమౌతుందో? అందుకే సన్నగా నవ్వి (మెల్ల నగి), రేపు పొద్దున మీ తండ్రి ఎవరో తెలుస్తుంది మీకు, వెళ్ళిరండి అని పంపించాడు. వాల్మీకి కి ఆ మాత్రం తెలియదా? ఆయన మర్నాడు సీతని తీసుకొచ్చాడు సభాభవనానికి. ఇప్పుడు చెప్తున్నాడు సీత గురించి.

ఆ. సీత సుద్దరాలు, చిత్తవాక్కర్మంబు
లందు సత్యమూర్తి యమలచరిత
పుణ్యసాధ్వి విడువఁ బోలదు చేకొను
రవికులాబ్ధిచంద్ర! రామచంద్ర! [9-355]

మనోవాక్కాయ కర్మలలో సీత పతివ్రత (సుద్దరాలు), అబద్ధం అనేమాట నోట రానిది (సత్యమూర్తి), పరిశుద్ధమైన నడవడిక గలది (అమల చరిత), పుణ్యమూర్తి. నువ్వు అలా విడవద్దు, వెనక్కి తీసుకో. అయితే సీత సుద్దరాలు అనే విషయం రాముడికి తెలియదా? రావణసంహారం తర్వాత ఘట్టంలో అగ్ని వచ్చి చెప్పాక తెల్సిందే కదా? మరోసారి వాల్మీకి మహర్షి చెప్పడం దేనికీ? రాముడికున్న గొడవ ఏమిటంటే రాజ్యంలో ప్రజలు ఇలా అనుకుంటున్నారు తన గురించి. ఒకసారి వచ్చిన అపవాదు అంత సులభంగా పోదు కదా? ఆ అపవాదు వచ్చినది ఎలాగా వచ్చింది. అప్పట్లో ఉన్న ధర్మం ప్రకారం సీతని వదిలేసాడు అనుకుందాం. అపవాదు పోయిందా? లేదనే సమాధానం వస్తుంది. సీత వైపు నుంచి చూస్తే ఇప్పుడు రాముడు సీతని మరోసారి చేరదీస్తే ముందు ముందు ఏమౌతుందో ఊహించడం అంత కష్టం కాదు. రావణుడి ఇంట్లో ఉన్న సీతని చేరదీసాడు అనే అపవాదు నుంచి, వాల్మీకి ఆశ్రమంలో ఉన్న ఈవిడని మళ్ళీ చేరదీశాడు అంటారేమో? జనం నోటికొచ్చినట్టూ మాట్లాడ్డం అందరికీ తెల్సిందే కదా?

బుద్ధుడి విషయంలో కూడా ఇలాంటిది జరిగినట్టూ చారిత్రాత్మక ఆధారాలు ఉన్నాయి. బుద్ధుడి పరినిర్వాణం చెందిన వార్త మగధలో మహాకాశ్యపుడికి తెల్సింది. ఆయన మిగతా భిక్షులందర్నీ ఒకచోట చేర్చి బుద్ధుడు చెప్పిన విషయాలన్నీ కూర్చి ఒకచోట ఉంచుదాం అనుకుంటూ ఉంటే సుభద్రుడనే ముసిలి భిక్షువు చటుక్కున అన్నాట్ట – "మన నాయకుడు పోయాడు కనక ఇంక మనం ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు హాయిగా బతకవచ్చు." అంటే ఇంతకాలం తమని బుద్ధుడు తలలు వంచి తన దారిలోకి లాగాడు అనుకునేవారు ఉన్నారు; బుద్ధుడు మాత్రం ఏనాడూ అలా చేయకపోయినా. ఆయన ఉన్నంతకాలం పైకి అనడానికి ధైర్యం లేదు. అంతటి గురువు పోయాడు, అయ్యో ఇప్పుడు మనకి ముందుకి దారి చూపించే వా రు ఎవరూ లేరే అనుకోవడం లేదు ఇటువంటివారు.

ఇదే దారిలో సీత కూడా ఆలోచించింది అని మనకి తెలుస్తుంది. రాముడు ఆవిడ శీలం మంచిదే అని నమ్మాడు. ఆవిడకీ మనసులో కల్మషం లేదని చాలామందికి తెల్సినదే. అయితే నోటికొచ్చినట్టూ వాగే వారి అపవాదులు విషం చిమ్ముతూ ప్రచారం పొందుతాయి. అందువల్ల ఇప్పుడు వాల్మీకి చెప్పినట్టూ రాముడు సీతని

మరోసారి వెనక్కి తీసుకున్నా మున్ముందు మరొకరు ఇంకోటి ఏదో వాగవచ్చు. ఈ విషయంలో రాముడు ఏమనుకున్నా సీతకు ఇటువంటి అవమానం మరోసారి అనవసరం కదా?

వ. అని వాల్మీకి పలుక, రామచంద్రుండు పుత్రార్థి యై విచారింపఁ, గుశ లవులను వాల్మీకికి నొప్పగించి, రామచంద్రచరణధ్యానంబు చేయుచు నిరాశ యై సీత భూవివరంబు జొచ్చె; నయ్యెడ. [9-356]

ఇవన్నీ తెలుసుకుంది సీత. పిల్లలని రాముడి చేతికి ఇచ్చి నిరాశతో భూదేవి వంట్లోకి వెళ్ళిపోయింది – తాను వచ్చిన చోటికే. ఇది రాముడే కాదు, వాల్మీకి తో సహా ఎవరూ ఊహించ(లే)ని మలుపు.

మ. ముదితా! యేటికిఁ గ్రుంకి తీవు మనలో మోహంబు చింతింపవే
వదనాంభోజము చూపవే మృదువు నీ వాక్యంబు విన్పింపవే
తుది చేయం దగ" దంచు నీశ్వరుఁడునై దుఃఖించె భూపాలుఁ డా
పదగాదే ప్రియురాలిఁ బాసిన తఱిన్ భావింప నెవ్వారికిన్? [9-357]

వ. అని వగచి, రామచంద్రుండు బ్రహ్మచర్యంబు ధరియించి, పదుమూఁడువేల యేం డ్లెడతెగకుండ నగ్నిహోత్రంబు చెల్లించి తా నీశ్వరుండు గావునఁ దన మొదలినెలవుకుం జనియె నివ్విధంబున. [9-358]

ఇంత జరిగాక రాముడు ఏడుస్తున్నాడు. ఎందుకు నువ్వు అలా వెళ్ళిపోయావు, వచ్చి ఒకసారి మొహం చూపించు, నాతో మాట్లాడు, అలా నన్ను వీడకు అంటూ. ముందు చెప్పుకున్నట్టూ సీత ముందు జరగబోయేది సరిగ్గా ఊహించగలిగింది మనం అనుకోవచ్చు. రాముడు సీత కోసం రాజ్యాధికారం తమ్ములలో మరొకరికి ఎవరికైనా ఇస్తానన్నా ఎవరూ తీసుకోరు కూడా (భరతుడు తీసుకోలేదు కదా). వాల్మీకి ఆశ్రమంలో ఉన్నప్పుడే సీతకి ఇవన్నీ తెలిసివచ్చాయి అనిపిస్తుంది. ఏదైతేనేం, ఇంతవరకూ వచ్చింది కనక, రాముడు పిల్లలని చేరదీసి, మరో పదమూడు వేల ఏళ్ళు బ్రహ్మచర్యం అవలంబిస్తూ రాజ్యం చేసాడు. అప్పటికి రామావతారం పూర్తైంది. దానితో వైకుంఠానికి చేరాడు.

మరో కొన్ని విషయాలు ఇందులో. లంకలో రాక్షసులందరూ అంతమైనా, శూర్పణఖ చావలేదు. ఆవిడే అయోధ్య వచ్చి రాముణ్ణి ఇంకా ఏడిపించడానికి చాకలివాడి భార్యగా ఒకరోజు అవతరించింది అనే కథ ఉంది. ఈ

చాకలివాడు మరో రాక్షసుడు. వాడూ, శూర్పణఖా భార్యా భర్తలుగా నటించి ఈ నాటకం ఆడారుట. ఆవిడ ఒకరోజు ఇంట్లో రాత్రి లేదని వీడు మర్నాడు పొద్దున్న 'భార్య చాలాకాలం నా ఇంట్లో లేనప్పుడు వెనక్కి తీసుకునే వెర్రి రాముణ్ణి కాదు నేను,' అనేసాడు, అదీ రాముడికి అర్ధం అయ్యేలా. తర్వాత వీళ్ళిద్దరూ అయోధ్యలోనే ఉన్నట్టూ హనుమంతుడు కనిపెట్టి పట్టుకుని పీకలు నులిమాడని కథ.

రాముడు రాజ్యం చేస్తున్న చివరి రోజులలో అప్పటికే అరణ్యాలకి వెళ్ళి తపస్సుచేసుకుంటున్న హనుమంతుడిని పిలిచి 'ఈ రాజ్యం చేయడం అంతా కష్టంగా ఉంది, సీత వెళ్ళిపోయాక, ఇంత కష్టం అని తెలియదు.' అని మామూలు మనిషిలా శోకిస్తూ ఉంటే హనుమంతుడు చెప్తాడు, "అదేమిటి, నువ్వు రాముడివి, ధర్మంగా రాజ్యం చేయడం అంటే కత్తిమీద సాము అని తెలియదా? ధర్మం నెరవేర్చాలంటే ఇవన్నీ తప్పవు కదా, మామూలు మానవుడిలా శోకించకూడదు." ఆ రోజుల్లోనే దుర్వాసుడు చెప్తాడు రాముడు మంత్రులతో ఒక పాత కథ. ఒకానొక దశలో దశరధుడు తన దగ్గిరకి వచ్చి 'రాముడు, తన మిగతాపిల్లల జీవితం ఎలా ఉండబోతోంది?' అని అడిగినట్టూ, దానికి తానిచ్చిన సమాధానం – "భృగు మహర్షి భార్యని చంపినందుకు, విష్ణువుకి శాపం ఉంది మనిషిగా పుట్టి, భార్యనుంచి వేరుగా ఉండమని. అందువల్ల రాముడికి జీవితంలో సుఖమనేది తక్కువ ఎక్కడ ఉన్నా. ఈ శాపం అనుభవించి తీరుతాడు." ఇది మొత్తం రామాయణంలో అంతా విశదంగా కనిపిస్తుంది. పదమూడు వేల ఏళ్ళు రాజ్యం చేసినా, రావణుడి వల్ల భార్య దూరమైనందుకూ, అపవాదు వల్ల తనకు తానే భార్యని దూరం చేసుకున్నందుకూ, రాజ్యం వద్దనుకున్నా తనకి జిగురులా తగులుకున్నందుకూ, దాన్ని వదులుకోవడం కుదరనందుకూ, అన్నీ కలిపి చూస్తే రాముడు నిజంగా సుఖం ఎప్పుడు అనుభవించాడనేది కనిపించదు మొత్తం రామాయణంలో. సీత పరిస్థితి మరీ దారుణం. అయితే త్రేతాయుగం లో ఉండే ధర్మం ఎటువంటిదో, అప్పటి పరిస్థితులు ఎటువంటివో మన ఊహకి అందవు. ఆ రోజుల్లో జరిగినది ఈ కలియుగంలో బేరీజు వేసి రాముడిలాంటివాడు, సీత అలాంటిది అనడం తప్పు కదా. సీతా రాముల్లో ఎవరు ఎటువంటి మానసిక క్షోభ అనుభవించారన్నది మనకి ఎలా తెలుస్తుంది? మరో విషయం మనం గుర్తుంచుకోవాలి. 'ప్రజల్లో ఎవరో ఒకరు ఇలా అన్నారు కనక వాళ్ళకి నేను ఏమీ ధర్మం గా రాజ్యం చేయక్కర్లేదు. వాళ్ళెలా పోతే నాకేం?' అనుకోలేదు రాముడు సీత భూమిలో కలిసిపోయాక కూడా. "వాళ్ళకి తనని విమర్శించే హక్కు ఉంది' అనుకుని ధర్మ బద్ధంగా పదమూడువేల ఏళ్ళు రాజ్యం చేసాడు. ఈ విషయం ఇప్పటి రాజకీయనాయకులు అర్ధం చేసుకోగలరా?

చ. వశుఁడుగ మ్రొక్కెదన్ లవణవార్ధి విజృంభణతా నివర్తికిన్
దశదిగధీశమౌళిమణి దర్పణమండిత దివ్యకీర్తికిన్
దశశతభానుమూర్తికి సుధారుచిభాషికి సాధుపోషికిన్
దశరథరాజుపట్టికిని దైత్యపతిం బొరిగొన్న జెట్టికిన్. [9-360]

కథ పూర్తయ్యాక శుకమహర్షి చెప్తున్నాడు ఇప్పుడు – సాగరుడి (లవణార్ధి) గర్వం అణిచినవాడికి (విజృంభణతా నివర్తికి), దశ దిక్పాలకులూ (దశదిగధీశ) తన కిరీటంలో మనులుగా ప్రకాశించే దివ్య కీర్తి ఉన్నవాడికి, వేయి (దశ–శత, 10x100) సూర్యుల వెలుగులా ఉండే వాడికి, మధురంగా సంభాషించేవాడికి (సుధారుచిభాషికి), సాధుజనులని పోషించేవాడికి, దశరథ సుతుడికి, రావణుణ్ణి (దైత్యపతి, రాక్షస రాజు) మట్టుపెట్టిన వీరుడికి (జెట్టికి) వినమ్రుడిగా భక్తితో (వశుడుగ) మొక్కుతున్నాను. ఈ పద్యంలో దశశత "భాను"మూర్తికి అనడంలో పోతన ఇదంతా చెప్పినది "సూర్య"వంశం కథ సుమా అని మనకి గుర్తు చేస్తున్నాడు. మరో అద్భుతమైన పద్యం రాముడి గురించి రాసి ముగిస్తున్నాడు ఈ కథ.

ఉ. నల్లనివాఁడు పద్మనయనంబులవాఁడు మహాశుగంబులున్
విల్లును దాల్చువాఁడు గడు విప్పగు వక్షమువాఁడు మేలు పైఁ
జల్లెడువాఁడు నిక్కిన భుజంబులవాఁడు యశంబు దిక్కులం
జల్లెడువాఁడు నైన రఘుసత్తముఁ డిచ్చుత మా కభీష్టముల్. [9-361]

బాగా ప్రాచుర్యం పొందిన ఈ ద్రాక్షాపాకం పద్యం పిల్లలకి సాధరణంగా పాఠశాలల్లో నేర్పేది. ఇందులో అర్థం కానీ పదాలు ఏవైనా ఉన్నాయంటే అవి "మహాశుగంబులన్," (మహా–గొప్పవైన, అశుగంబులన్–బాణాలని), "యశంబు" (కీర్తి), "అభీష్టముల్" (కోరికలు). మిగతా పద్యం అంతా అతి సులభంగా అర్థం అవుతుంది. కళ్ళు మూసుకుని ఈ పద్యం చదువుతూంటే, రాముడు తమ ఎదురుగా నుంచున్నట్టు తోచడం అనేకమందికి అనుభవంలోకి వచ్చిన విషయం. మరో విషయం, ఈ పద్యంలో ఉన్న "రఘుసత్తముడు" అనేది అనేకానేక పాటల్లో, పద్యాలలో అనంతంగా కనిపిస్తుంది మనకి. ఇదే కోవలో రాసిన "రఘువంశ సుధాంబుధి చంద్ర శ్రీ..." అనే పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్ గారి కృతి కూడా.

క. మంతనములు సద్గతులకుఁ
బొంతనములు ఘనములైన పుణ్యముల కిదా
నీంతనపూర్వమహాఘ ని
కృంతనములు రామనామ కృతి చింతనముల్. [9-363]

రాముడి గొప్పదనం గురించి చెప్పాక రామ నామం గురించి ఇప్పుడు చెప్తున్నారు. సద్గతి కలిగించేదీ, మహా పుణ్యం కలిగించేదీ, పూర్వ జన్మలో చేసుకున్న మాహాపాపాలు (మహాఘ- గొప్పవైన అఘ-పాపాలు) పోగెట్టేదీ, రామనామ స్మరణ (చింతనము). అతి సులభంగా అందరూ పలకగలిగేది కనక 'రామ' అనే శబ్దం, భగవంతుడి పేరు మంగళకరమైనది కాబట్టి ఎవరైనా చావు దగ్గిరపడి శరీరం విడిచేటప్పుడు దగ్గిరవారు రామ నామం పోయేవారి చెవిలో చెప్పడం ఆచారంగా గమనించవచ్చు.

ఇక్కడనుంచి సూర్యవంశం అనేక తరాలు సాగి సాగి విశ్వసాహ్యుడు అనేఆయన దగ్గిర తేలుతుంది. ఆయనకి బృహద్బలుడు ఆనే ఆయన పుట్టాడు. మహా భారత యుద్ధంలో ఈ బృహద్బలుడు మీ తండ్రి అభిమన్యుడి చేతిలో చచ్చిపోయాడు అని శుకమహర్షి పరీక్షిత్ తో చెప్పాక కథ ఇక్కడతో ఆగుతుంది. కలియుగంలో ఈ సూర్యవంశంలో ఒకాయన కలాప అనే గ్రామంలోంచి ఉద్భవించి సూర్యవంశాన్ని ఉద్ధరిస్తాడని చెప్పడంతో ముగిస్తాడు శుకమహర్షి.

.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS